


తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి

పాలకోడేరు: వరి పైరుకు వస్తున్న తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. పెన్నాడ అగ్రహారం, పెన్నాడపాలెంలో వరి పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వేసి రెండు నెలలు గడుస్తున్నా చేలు తయారవకుండా పసుపుపచ్చగా తయారవుతున్నాయని, కుళ్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలు వరకు పెట్టుబడి పెట్టారన్నారు. పెన్నాడపాలెం ప్రాంతంలో రెండువందల ఎకరాల వరకు వరిపైరు తయారవ్వకుండా రకరకాల తెగుళ్లు వ్యాపించి రైతులు ఇబ్బందులు పడుతున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణం వ్యవసాయాధికారులు పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇవ్వాలని, తెగుళ్ల నివారణకు పురుగుమందులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలురైతులు కె.సత్యనారాయణ,శివశంకర్, వెంకటేశ్వరరావు, సత్యం పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

హాజరు కానున్న 35,949 మంది విద్యార్థులు - జిల్లాలో 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు


పాలకొల్లులో ఇంటర్ పరీక్షల కోసం వేసిన బెంచీలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ రాత పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 35,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరం జనరల్ 16,017 మంది, ఒకేషనల్ 1,789 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ 16,362 మంది, 1,781 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ఆయా ప్రాంతాలను అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ఏ ఒక్క అధికారి వద్ద సెల్‌ఫోన్ ఉండదు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారి వద్ద బేసిక్ ఫోన్ ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించే ప్రసక్తి లేదని అధికారులు చెబుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అరగంట ముందే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే పకడ్బందీగా చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించడంతోపాటు విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయిన సంగతి తెలిసిందే.

పాలకొల్లు : మార్చి 1వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాలకొల్లులో మొత్తం 6 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎఎస్ఎన్ఎం జూనియర్ కాలేజీలో 643 మంది, కోకోనట్ జూనియర్ కాలేజీలో 324 మంది, సబితాలో 293 మంది, ఆదిత్యలో 569 మంది, చైతన్యలో 598 మంది, గౌతమిలో 407 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తం పట్టణంలో 2,834 మంది పరీక్ష రాయాల్సి ఉంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:30 గంటలకు పరీక్ష హాల్లోకి విద్యార్థులను లోనికి పంపుతారు. 9 గంటలు దాటాక ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంది. పరీక్ష హాల్లోకి ఎటువంటి సెల్‌ఫోన్ ఎల్రక్టికల్ పరికరాలను అనుమతించరు. ప్రతి గదీ సీసీ కెమెరాలు నిఘాలో ఉన్నాయి. ఎటువంటి చిన్న నేరం చేసిన విద్యార్థులను డిబార్ చేస్తారు. పరీక్ష హాల్ వద్ద వైద్య సదుపాయం కల్పించారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం కూడా కల్పించారు. నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా ఏర్పాట్లు చేశారు.

అన్నదమ్ముళ్ల నడుమ సయోధ్యా.. సమరమా..!

ఎంఎల్ఎ రామరాజు, మాజీ ఎంఎల్ఎ శివరామరాజు మధ్య సయోధ్యకు ఎంపీ రఘురామకృష్ణంరాజు ప్రయత్నం

రసకందదాయకంగా 'ఉండి' రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం, కాళ్ల

వచ్చే ఎన్నికల్లో వరుసకు అన్నదమ్ముళ్ల మధ్య సమరమా.. లేక సయోధ్య అనే ఉత్కంఠ ఉండి నియోజకవర్గవాసులతోపాటు జిల్లా ప్రజల్లో నెలకొంది. ఉండి ఎంఎల్‌ఎ ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) మధ్య టిక్కెట్ విషయంలో ఏర్పడిన తగాదా తారాస్థాయికి చేరింది. శివరామరాజు మద్దతు కోరేందుకు వచ్చిన రామరాజుతో మాట్లాడేందుకు నిరాకరించడంతో రామరాజు కంగుతిని అవమానభారంతో వెనుదిరిగారు. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో శివ వైసిపి గూటికి చేరి బరిలోకి దిగుతారనే ప్రచారం ఒకవైపు, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ప్రచారం మరోవైపు పెద్దఎత్తున సాగుతోంది. ఈ క్రమంలో రామరాజు, శివరామరాజు మధ్య సయోధ్య కుదిర్చేందుకు సయోధ్య కుదిర్చేందుకు నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు రంగంలోకి దిగినట్లు తెలిసింది. మాజీ ఎంఎల్ఎ శివరామరాజును బుజ్జగించేందుకు హైదరాబాద్ తీసుకెళ్లినట్లు సమాచారం. అలాగే రామరాజును కూడా హైదరాబాద్ పిలిపించారనే ప్రచారం సాగుతోంది. రఘురామకృష్ణంరాజు నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగితే ఉండిలో వీరు ఇరువురి మధ్య నెలకొన్న విభేదాల ప్రభావం తనపై పడే అవకాశం ఉండటంతో రఘురామకృష్ణంరాజు నేరుగా రంగంలోకి దిగారని చెబుతున్నారు. ఇప్పటికే జనసేన గూటికి చేరేందుకు సిద్ధమైన భీమవరం మాజీ ఎంఎల్ఎ శివను బుజ్జగించేందుకు ప్రయత్నించిన సంగతి తెలిసిందే. రఘురామకృష్ణంరాజు జోక్యంతో రామరాజు, శివరామరాజు మధ్య సయోధ్య కుదురుతుందా లేక సమరమేనా అనే చర్చ విస్తృతంగా సాగుతోంది. టిడిపికి కంచుకోటలో వీరిద్దరి మధ్య సయోధ్య కుదరకపోతే వైసిపి విజయకేతనం ఎగురవేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


శివతో మాట్లాడేందుకు యత్నిస్తున్న రామరాజు (ఫైల్‌ఫొటో)

'విష్ణు'లో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలు

కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భీమవరం పట్టణంలోని విష్ణు కాలేజీలో స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో విష్ణు కాలేజీలో స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్ల పేర్లు మార్పు, ఫారం-6, 7, 8 క్లెయిమ్స్ తదితర అంశాలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సార్వత్రిక ఎన్నికల కోసం పట్టణంలోని విష్ణు కాలేజీలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్లెయిమ్స్, డిస్పోజల్ ప్రక్రియ వేగవంతం

ప్రత్యేక ఓటరు సవరణ జాబితా కార్యక్రమం-2024 కింద చేపడుతున్న కంటిన్యూయేషన్ అప్డేషన్‌లో భాగంగా ఫారం-6, 7, 8 క్లెయిమ్స్, డిస్పోజల్ ప్రక్రియ వేగవంతం చేశామని కలెక్టర్ తెలిపారు. తుది ఓటర్ల జాబితా విడుదల అనంతరం కంటిన్యూయేషన్ అప్డేషన్‌లో భాగంగా ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఫారం-6, 8కి సంబంధించి ఎలాంటి సమస్యా లేదని, ఫారం-7కి సంబంధించి డెత్ కేసులు, డూప్లికేట్ కేసులను పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు (వైసిపి), మరపట్ల శ్యాంబాబు (టిడిపి), కోమటి రవికుమార్ (బిజెపి), తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), కాటూరి కరుణాకర్ (బిఎస్‌పి) పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వివరాలు

1.ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం: సీత పాలిటెక్నిక్ కళాశాల భవనంలో రెండో అంతస్తులో స్ట్రాంగ్‌రూమ్, డ్రాయింగ్ హాల్-1, 2లో కౌంటింగ్ సెంటర్

2.పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గం: విష్ణు స్కూల్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్‌రూమ్, అన్నపూర్ణ క్యాంటీన్ డైనింగ్ హాల్-1, 2ల్లో కౌంటింగ్ కేంద్రం

3.నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గం: విష్ణు స్కూల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్‌రూమ్, సీత ఇండోర్ ఆడిటోరియం-1, 2 విభాగాల్లో కౌంటింగ్ సెంటర్.

4.భీమవరం అసెంబ్లీ నియోజకవర్గం: సీత పాలిటెక్నిక్ కాలేజ్ భవనంలోని మొదటి అంతస్తులో స్ట్రాంగ్‌రూమ్, ఆడిటోరియం మూడు, నాలుగు విభాగాల్లో కౌంటింగ్ సెంటర్

5.ఉండి అసెంబ్లీ నియోజకవర్గం: సీత పాలిటెక్నిక్ కాలేజ్ భవనంలోని రెండో అంతస్తులో స్ట్రాంగ్‌రూమ్, ఉమెన్ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు-1, 2ల్లో కౌంటింగ్ సెంటర్

6.తణుకు అసెంబ్లీ నియోజకవర్గం: విష్ణు కాలేజీ స్కూల్ భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో స్ట్రాంగ్‌రూమ్, విష్ణు ఫుడ్ ప్లాజా డైనింగ్ హాల్-1, 2ల్లో కౌంటింగ్ సెంటర్

7.తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం: విష్ణు స్కూల్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్ రూమ్, సెమినార్ హాలులో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు

8.నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం: పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు విష్ణు కాలేజీ ఫార్మసీ ఫస్ట్ ఫ్లోర్ క్లాస్ రూమ్‌లో స్ట్రాంగ్‌రూమ్, ఫార్మసీ లైబ్రరీ హాల్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. మిగిలిన ఎంపీ ఓట్లన్నీ ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే పార్లమెంట్ అభ్యర్థి ఓట్లకు వేరేగా కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

తాళ్లకోడు కాలనీలో సౌకర్యాలు కల్పించండి

అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం - ఫలించిన సిపిఎం పోరు

ప్రజాశక్తి - ఆకివీడు


సిపిఎం బృందం, జగనన్న కాలనీ బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్థానిక జగనన్న (తాళ్లకోడు) కాలనీలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు తక్షణమే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అధికారులను ఆదేశించారు. కాలనీ నివాసితులతో కలిసి సిపిఎం బృందం ఇటీవల జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ గురువారం తన ఛాంబర్‌లో కాలనీ నివాసితులు, సిపిఎం నేతలు, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, డ్రెయినేజీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో కాలనీలో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. తక్షణమే నగర పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో తాగునీరు అందించాలన్నారు. జిల్లాలోనే అతి పెద్దదైన ఈ లేఅవుట్‌కు రోడ్లు మార్జిన్లలో డ్రెయినేజీల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే రూపొందించాలని ఆదేశించారు. కాలనీలో వెంటనే మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో గస్తీకి పోలీసులకు సూచనలు చేశారు. తొలుత సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, నివాసితులు ఎన్.రమణ, రామారావు, ఏసు, పిసిని శ్రీనివాస్, వరలక్ష్మి, గాలి నాయుడు, ప్రజాసంఘాల నాయకులు కె.తవిటినాయుడు, బివి.వర్మ, ఎస్.ఉదయకుమారి, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన వారానికే..

రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి - వధువు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మొగల్తూరు


అంజిబాబు(ఫైల్‌ఫొటో)

'పెళ్లయి వారం రోజులైనా కాలేదు. నవ వరుడు తన అభిమాన నేత పవన్ కళ్యాణ్ సభకు వెళ్లి అక్కడ నుంచి స్నేహితుడిని కలిసి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడంతో పెళ్లింట పెనువిషాదం నెలకొంది. ఈ విషయం తెలియగానే నవ వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన ఏనుగుల చక్రపాణి, ఆదిలక్ష్మి దంపతులకు కుమారుడు ఏనుగుల అంజిబాబు (31), కుమార్తె ఉన్నారు. ఈ నెల 24న అంజిబాబుకు పాలకొల్లు మండలం లంకలకోడేరుకు చెందిన శిరీషాతో వివాహమైంది. అంజిబాబు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వీరాభిమాని. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 28వ తేదీ బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అక్కడ నుంచి ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ఉన్న స్నేహితుడిని కలవడానికి వెళ్లి వెంటనే ఇంటికి మోటారు సైకిల్‌పై బయల్దేరాడు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అంజిబాబు జేబులో ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వృద్ధులైన అంజిబాబు తల్లిదండ్రులు, లంకలకోడేరులో ఉన్న భార్య శిరీష శోకసంద్రంలో మునిగిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబీకులు హుటాహుటీన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. వికలాంగులైన అంజిబాబు తల్లిదండ్రుల పోషణభారమంతా అంజిబాబు చూస్తున్నాడు. పెళ్లయి వారం రోజులు కాకుండానే ముంచుకొచ్చిన మృత్యువుతో ఆ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

రానున్న ఎన్నికల్లో సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల విధులు అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం భీమవరం, ఉండి నియోజకవర్గాల సెక్టార్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రీ పోల్ ఏర్పాట్లన్నింటినీ నోటిఫికేషన్ రాకముందే పూర్తి చేయాలన్నారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇవిఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు తెచ్చేవరకూ సెక్టార్ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సెక్టార్ అధికారులతోపాటు పోలీస్ శాఖ నుండి కూడా సెక్టార్ అధికారులు ఉంటారని, వీరు ఇరువురు సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయాలి

సెక్టార్ అధికారులు పోలింగ్ స్టేషన్లను సందర్శించి కనీస అవసరాలను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ర్యాంప్‌లు, ఫర్నీచర్, మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. బూత్ నెంబర్లను వేయాలని, బిఎల్ఒ పేరు, ఫోన్ నెంబర్లను పోలింగ్ స్టేషన్ వద్ద రాయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఎంతమంది ఓటర్లు ఉన్నారు, వికలాంగులు, వృద్ధులు తదితర సమాచారాన్ని కలిగి ఉండాలన్నారు. వికలాంగులకు, 80 ఏళ్లు దాటినా వారు ఓటింగ్‌కు రాలేని వారి కోసం అధికారులే వాహన ఏర్పాట్లను చేయాలన్నారు.

రూట్‌మ్యాప్‌లను తయారు చేయాలి
జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి


సెక్టార్ అధికారులు పోలీస్ అధికారులతో కలిసి వారి పోలింగ్ స్టేషన్లకు సంబంధించి, ఏ రూట్ ఎలా ఉంది, ఏది తక్కువ దూరం వస్తుంది, ఎంత సమయం పడుతోంది తదితర అంశాలతో రూట్‌మ్యాప్‌లను తయారు చేసి అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల రోజున అదే రూట్‌లో ఇవిఎంలు, పోలింగ్ పర్సన్స్‌ను తీసుకుని షెడ్యూల్డు రూట్‌లోనే వాహనాలు వెళ్లాలని, ప్రతి వాహనానికీ జిపిఎస్ అమర్చి ఉంటుందని అన్నారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కనీసం మూడుసార్లు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి రూట్‌మ్యాప్‌లను రూపొందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్.అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, భీమవరం, ఉండి నియోజకవర్గాల సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'జోగయ్య సలహాలు తీసుకోననడం బాధాకరం'

ప్రజాశక్తి - నరసాపురం

విలువలతో కూడిన రాజకీయాలు చేసిన వ్యక్తి మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య అని, అటువంటి జోగయ్య సలహాలు, సూచనలు తీసుకోబోమని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పడం బాధాకరమని నర్సాపురం సర్పంచుల ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, యర్రంశెట్టిపాలెం మాజీ సర్పంచి కూనపరెడ్డి వీర వెంకటవిజయరంగారావు అన్నారు. గురువారం యర్రంశెట్టిపాలెంలోని తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమితి అధ్యక్షుడు నుంచి రాష్ట్ర హోం శాఖా మంత్రిగా గతంలో ఎన్నో పదవులు చేపట్టిన జోగయ్య ఎన్‌టిఆర్ వంటి ప్రముఖులకే సలహాలిచ్చారన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పవన్‌కల్యాణ్‌కు జోగయ్య సలహాలు, సూచనలు ఇస్తే వాటిని తీసుకోననడం దారుణమన్నారు. వైసిపి నరసాపురం ఎంపీగా పదవిని అనుభవిస్తూ ఇటీవలే ఆ పార్టీకి రాజీ నామా చేసిన కనుమూరి రఘురామకృష్ణంరాజు టిడిపి, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థిని తానే అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రఘురామకృష్ణంరాజుకు నరసాపురం ఓటర్లు ఎలా కనబడుతున్నారని రంగారావు ప్రశ్నించారు.

ఈత పోటీల్లో నిట్ విద్యార్థి సత్తా


ఈత పోటీల్లో సత్తాచాటిన విద్యార్థితో యాజమాన్యం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్)లో ఇసిఇ ప్రథమ సంవత్సరం చదువుతున్న దుబ్బా గుణవంత్‌రెడ్డి ఈత (స్విమ్మింగ్) పోటీల్లో సత్తా చాటి రెండు పతకాలను కైవసం చేసుకున్నాడు. ఒడిశ్శాలోని రూర్కెల ఎన్ఐటిలో ఇటీవల నిర్వహించిన ఆలిండియా ఇంటర్ ఎన్ఐటిల ఈత పోటీల్లో అద్భుత ప్రతిభను కనబరిచి, బ్యాక్ స్ట్రోక్ వంద మీటర్ల విభాగంలో రజతం, బ్యాక్‌స్ట్రోక్ 50 మీటర్ల విభాగంలో కాంస్య పతకాలను దక్కించుకున్నాడు. స్విమ్మింగ్‌తోపాటు ఫుట్‌బాల్ క్రీడలో కూడా గుణవంత్‌రెడ్డి ప్రావీణ్యం సంపాదించాడు. ఈ సందర్భంగా ఆయనను ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. తమ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ అద్వితీయ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తూ బహుమతులను సాధిస్తున్నారన్నారు. సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావడం అభినందనీయన్నారు. ప్రతి విద్యార్థీ సంస్థ కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. గుణ స్ఫూర్తితో మరిన్ని పతకాలను తీసుకురావడానికి క్రీడాకారులను మెరికల్లా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, సాస్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, సాస్ అసిస్టెంట్లు డాక్టర్ వి.శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిరామ్ పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి మాంసం ధరలు

ప్రజాశక్తి - నరసాపురం


విక్రయానికి సిద్ధంగా మాంసం

కోడి మాంసం ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొన్ని రోజుల క్రితం వరకూ కిలో రూ.200లకుపైగా ఉన్న ధర ఒక్కసారిగా కొండెక్కింది. వేసవిలో ఫారం, బాయిలర్ కోళ్లు ఎండ వేడిమికి చనిపోతుంటాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఫారాల నిర్వహణపై పెద్దగా ఆసక్తి చూపరు. ఒకవేళ నిర్వహించినా నష్టాలు రావడంతో రైతులు వీటికి దూరంగా ఉంటున్నారు. దీంతో కోళ్లు అందుబాటులో లేక ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దాణా రేట్లు పెరగడం నిర్వహణ భారంగా మారిందని రైతులు చెబుతున్నారు. ఫలితంగా కోడిమాంసం ధర అమాంతం కొండెక్కింది. కిలో బాయిలర్ మాంసం రూ.280, లైవ్ రూ.180, స్కిన్ లెస్ రూ.300, బ్రాయిలర్ బోన్ లెస్ రూ.420లకు విక్రయిస్తున్నారు. ఫారం కోడి మాంసం ధర రూ.200, లైవ్ రూ.150 ఉంది. వేసవిలో గ్రామాల్లో జాతర్లు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. గతంలో కంటే రెస్టారెంట్, భోజనం హోటల్లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లోనూ చికెన్ వినియోగం బాగా పెరిగింది. ఈ కాలంలో చేపల వినియోగం తగ్గి మాంసం వినియోగం పెరగడమూ మరో కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగినట్లు కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగాయి. అయితే కోడిమాంసం ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా


ఎఎల్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

విజయనగరంలోని మిమ్స్‌లో పని చేస్తున్న ఉద్యోగులపై వేధింపులు ఆపి, వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. భీమవరంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడారు. విజయనగరం మిమ్స్ ఉద్యోగులపై యూనియన్ పెట్టుకున్నారనే పేరుతో తొలగింపులు, వేధింపులు చేయడం దానికి అధికారులు వత్తాసు పలకడం దారుణమన్నారు. వారికి రావాల్సిన వేతన బకాయిలు, డిఎలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నప్పటికీ రెగ్యులర్ చేయడం లేదని, వేతన ఒప్పందం చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఈ సమస్యలపై అడిగినందుకు తొలగింపులు బదిలీల పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాల్సిన కార్మిక శాఖ అధికారులు యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కార్మిక శాఖ విధులను నిర్వీర్యం చేసి యాజమాన్యానికి అనుకూలమైన పద్ధతుల్లో చట్టాలు మార్పు చేస్తున్న ప్రభుత్వాల వైఖరిని ప్రజలు గమనించాలన్నారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావన్నారు. తక్షణం మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం కార్మిక శాఖ కార్యాలయ ఎఎల్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు సూర్యచంద్రరాజు, ఇంజేటి శ్రీనివాస్, కలిపిండి సత్యనారాయణ, బంగారు వరలక్ష్మి, చెలబోయిన వెంకటేశ్వరరావు, దేగల నాగు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పనులు శరవేగంగా పూర్తిచేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు శరవేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో 29వ వార్డు కాటన్ పార్కులో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేస్తున్న పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొందరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

పేదలకు సిఎం సహాయ నిధి వరం

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం సహాయ నిధి పేదలకు వరం అని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామానికి చెందిన జల్లి మణిక్యం వైద్యం నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన 80,000 రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.


ఫలితాలను విడుదల చేస్తున్న కరస్పాండెంట్ సత్య ఉషారాణి

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - తణుకురూరల్

2023 డిసెంబరులో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో జరిగిన డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను గురువారం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ బిఎ 87 శాతం, బికాం 78 శాతం, బిఎస్‌సి 87 శాతం, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్‌లో బిఎ 65 శాతం, బికాం 66 శాతం, బిఎస్‌సి 70 శాతం, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ బిఎ 90 శాతం, బికాం 96 శాతం, బిఎస్‌సి 82 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్షా ఫలితాలను సకాలంలో విడుదల చేసినందుకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కెవి.రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్‌ఎస్‌వివిఎస్ కుమార్‌ను అభినందించారు. కళాశాల ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రెటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులను అభినందించారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్లో నిర్వహించిన పల్స్ పోలియోపై హెల్త్, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం కమిషనర్ కెవి.రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ నెల 3వ తేదీన బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో 40 బూత్‌ల్లో మార్చి నెల మొదటి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ స్వరూప్, వైద్యులు కారిపల్లి మోహన్, పి.సోనియా, సత్యభూషణ్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎం ఎంఇఓలు, అంగన్‌వాడీ పాల్గొన్నారు.

పాలకోడేరు : ఈ నెల మూడో తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని పాలకోడేరు పిహెచ్‌సి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రంగనాయకులు అన్నారు. గొరగనమూడి లో వైద్యఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కల ఆవశ్యకత, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సం వత్సరాలలోపు పిల్లలు అందరికీ పల్స్ పోలియో చుక్కలు వేసేలా చూడాలని తల్లితం డ్రులకు సూచించారు. ఏ ప్రాంతంలో ఉన్నా పల్స్ పోలియో చుక్కలు ఆయా గ్రామాలలోని పల్స్ పోలియో బూత్ వద్దకు తీసుకువెళ్లి చుక్కలు వేయించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ ఎం. విజయప్రసాద్, ఎఎన్ఎంలు వేద కుమారి, సుజాత, ఆశాలు శాంతి, కుమారిలు ఉన్నారు.

సిబ్బందికి శిక్షణ

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో ఎఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు, హెల్త్ అసిస్టెంట్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియోపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో 35 బూత్‌లు ఏర్పాటు చేశామని, 3,535 మంది పిల్లలకు పోలియో డ్రాప్స్ వేస్తామని, ప్రతి బూత్‌లోనూ నలుగురు సిబ్బంది ఉంటారని, 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పోలియో చుక్కలు వేయించే ముందు, చుక్కలు వేసిన తర్వాత పిల్లలకు ఏ ఇతర మందులు వేయించరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్‌కె.అమలేశ్వరరావు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పాలకొల్లు రాక

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి గురువారం పాలకొల్లు విచ్చేశారు. స్థానిక ఎస్ కన్వెన్షన్‌లోని బంధువుల వివాహానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా శేషసాయిని పాలకొల్లు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చెన్నకేశవ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ

ఉండి: పార్వతి సమేత చెన్న మల్లేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం చెరుకువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న పివిఎల్ నరసింహరాజు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండేటి సాంబశివరావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు.

కాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలి

రోడ్లపైకి మురుగునీరు - దుర్వాసన, దోమలతో ఇందిరమ్మ కాలనీ వాసుల అవస్థలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ఇందిరమ్మ కాలనీలో శాశ్వత డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. 2006లో ఏర్పాటు చేసిన కాలనీలో అప్పటి పంచాయతీ అధికారులు వెయ్యి మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడంతో వారు ఇళ్లు నిర్మించుకున్నారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టడంతో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అయితే శాశ్వత డ్రెయినేజీలు ఏర్పాటు చేయకుండా కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం మురుగు కాలువలు పూడుకుపోవడంతో వాడకం నీరు వెళ్లక దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలనీలో శాశ్వత డ్రెయినేజీ నిర్మించకపోతే రానున్న వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు వెంటనే ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు.


ఇందిరమ్మ కాలనీలో అధ్వానంగా ఉన్న కచ్చా డ్రెయిన్

అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - వీరవాసరం

ఉత్తరపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సదుపాయం కల్పిస్తారా లేదా అంటూ ఉత్తరపాలెం పంచాయతీని సిపిఎం ప్రశ్నించింది. ఉత్తరపాలెం సిపిఎం గ్రామ సమావేశం నున్నబోయిన సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని భీమవరం ఎంఎల్‌ఎ ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఆ భవనానికి ఇంకా విద్యుత్ సదుపాయం కల్పించకపోవడం పట్ల సిపిఎం పంచాయతీ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ పసిపిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ వారు విద్యుత్ సదుపాయం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ఫ్యాన్లు తిరగక పసి పిల్లలు దోమ కాటుకు గురై అనారోగ్యపాలవుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సర్పంచి తమ బంధువుల భవనాలకు మాత్రం లక్షలు ఖర్చు పెట్టి కరెంటు స్తంభాలు వేసి విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు కానీ విద్యుత్ సదుపాయం లేని అంగన్‌వాడీ భవనం మాత్రం వారి కంటికి కనిపించడంలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సదుపాయం కోసం అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన రెండు స్తంభాలే వేయించలేని స్థితిలో పంచాయతీ ఉందా అంటూ ఆయన ప్రశ్నించారు. రూ. లక్షా నలభై వేలు ఖర్చుచేసి ఆర్‌బికె కేంద్రాన్ని మొండి గోడలతో వదిలేశారు తప్ప అంగన్‌వాడీలో ఉండే పసిపిల్లల గోడు మాత్రం వారికి పట్టడం లేదన్నారు. తక్షణం కరంటు స్తంభాలు ఏర్పాటు చేసి పంచాయతీ పరువు నిలబెట్టుకోవాలంటూ హితవు పలికారు. ఉత్తరపాలెంలో జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు ఎందుకు కల్పించలేదో పంచాయతీ పాలకవర్గం సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఉత్తరపాలెం పంచాయతీ వారు ఏం అభివృద్ధి చేశారో ఏ సంక్షేమం చేశారో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎంఎల్‌ఎచే గ్రామ సచివాలయాన్ని ప్రారంభింపజేసిన పంచాయతీ వారు ఆ ఎంఎల్‌ఎతో ఏ ఒక్క వాగ్దానం చేయించుకోలేకపోవడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో పాలా అజయ్‌ఘోష్, జుత్తిగ సాంబియాంబ, కేతా జ్యోతిబసు, పాలా కోటేశ్వరరావు, జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు క్లెయిమ్‌లు పరిష్కరించాలి

ఎఐటియుసి

ప్రజాశక్తి - భీమవరం

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న నలభై వేల క్లయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘాల పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ మండలి నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాల కోసం దారి మళ్లించడంతో ఐదేళ్లుగా వెల్ఫేర్ బోర్డు నిర్వీర్యం అయ్యిందన్నారు. జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లాడ నాగరాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడారు. అనంతరం ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ శివన్నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి జిల్లా యూనియన్ నాయకులు కోడే సాయి బాలాజీ, మైలవరపు శ్రీరామ్ బాబు, తణుకు తాలూకా అధ్యక్షులు సాసుమిల్లి ఫల్గుణరావు పాల్గొన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ఎస్‌సి, బిసిలకే అధిక ప్రాధాన్యత : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఎస్‌సి, బిసిలకు అధిక ప్రాధాన్యతిస్తూ పని చేస్తున్నానని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. అరటకట్ల గ్రామం కొమ్ము ఎస్‌సి కాలనీలో ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న ఎస్‌సి సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో సామాజిక భవన నిర్మాణానికి గతంలో ఎస్‌సి కార్పొరేషన్ నిధులు మంజూరైనా ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిందన్నారు. టిడిపి అధికారంలో లేకపోయినా ఎంపీ కనకమెడల రవీంద్రకుమార్ ఎంపీ నిధులను తీసుకొచ్చానని రామానాయుడు తెలిపారు. సామాజిక భవనం కింద భాగంతో పాటు పై ఫ్లోర్ అన్ని సౌకర్యాలతో సుందరంగా నిర్మాణం జరిగేలా మరో రూ.35 లక్షల మంజూరు చేసి పూర్తి చేయించే బాధ్యత తనదన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉద్దరాజు శ్రీనివాస్‌రాజు, గ్రామ పెద్దలు పొత్తూరి కుమారస్వామి రాజు, చింతపల్లి సత్యనారాయణ, పొత్తూరి విజయ్ కుమార్ రాజు, చింతపల్లి శ్రీనివాసులు, మంతెన ధర్మరాజు, పోలిశెట్టి లక్ష్మీపతి, కలిదిండి రమేష్ రాజు పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎను కలిసిన నేతలు

అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి పార్టీ నుంచి నియమితులైన నూతన కమిటీ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి తమ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని తెలిపారు. నిరంతరం ముఖ్యమంత్రి ప్రజాసేవలోనే ఉన్నారని, ఆయన అండదండలతోనే భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధర్ రావు, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, వైస్ ప్రెసిడెంట్లు గాదిరాజు రామరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు మల్లుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రంగరాజు

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆచంట నియోజకవర్గ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట వేమవరంలో సుమారు రూ.45 లక్షల జిల్లా పరిషత్ నిధులతో చేపట్టనున్న డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆయన గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్ నిర్మాణం వల్ల పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంపు నుంచి విముక్తి కలుగుతుందన్నారు. మెయిన్ డ్రెయిన్‌కు అనుసంధానంగా ఉన్న వీధుల నుంచి ఈ డ్రెయిన్‌లోకి వర్షపు నీరు వస్తుందని తద్వారా కాలనీవాసుల కష్టాలు తీరతాయని తెలిపారు. అనంతరం హరిజన పేటను సందర్శించి గొంతెనమ్మ గుడి నిర్మాణ పనులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రంగనాథరాజును సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

16కు లోక్ అదాలత్ వాయిదా

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈనెల 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ 16వ తేదీకి మార్చినట్లు నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు తేదీ మార్చడం జరిగిందని, దీన్ని గమనించి న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, బ్యాంక్, బిఎస్‌ఎన్‌ఎల్, తదితర కేసులను 16వ తేదీ శనివారం రాజీ చేసుకోవాలని తెలిపారు.

నరసమ్మ కుటుంబానికి ముదునూరి పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన సీతారామపురం సౌత్ పిల్లి పేటకు చెందిన మేడిది వెంకట నరసమ్మ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం పరామర్శించారు. వారికి సానుభూతి తెలిపారు.

పేర్ని నానికి ఎందుకు ఆందోళన : కొత్తపల్లి

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి, జనసేన సభ నిర్వహిస్తే మాజీ మంత్రి పేర్ని నానీకి ఎందుకు ఆందోళనని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రశ్నించారు. మొగల్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించడమే పనిగా పేర్ని నాని ఉన్నారన్నారు. పవన్ రాష్ట్రాభివృద్ధి కోసం స్వార్థం లేని రాజకీయం చేస్తున్నారని తెలిపారు. వైసిపిలో ఉన్న స్వార్థం జనసేనలో లేదన్నారు. జన సైనికులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని పవన్ కళ్యాణ్ చెబితే దాన్ని వక్రీకరించి మాట్లాడడం వైసిపికి అలవాటు అన్నారు.

చురుగ్గా పట్టిసీమ ఉత్సవాలకు ఏర్పాట్లు

ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమలో నిర్వ హించనున్న మహాశివరాత్రి ఉత్సవాల పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ అన్నారు. గోదావరి నదిపై నడక మార్గం ఏర్పాటుకు డ్రెడ్జింగ్ పనులు వేగవంతంగా జరు గుతున్నాయని తెలిపారు. ఇప్పటికే దాదాపు మూడు శాతం పనులు పూర్తయ్యాయని, గోదావరి నదిలో మార్గమునకు పంటులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అధికారులకు చలువ పందిళ్లు వేశామని, టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సుమారు రెండు లక్షల మంది యాత్రికులు వస్తారని తెలపడంతో నడిచేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారు పనులను పరిశీలిస్తున్నారన్నారు. గోదావరి నది నుంచి ఆలయం వరకు ఇసుక తెన్నెల్లో రహదారి మార్గంలో యాత్రికులు సేద తీర్చుకునేందుకు చలువ పందిళ్లు, నదిలో స్నానం చేసిన యాత్రికులు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఉత్సవాలకు రెండు రోజుల ముందే పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పనులు చురుగ్గా సాగుతున్నాయని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ, బొరుసు రాంబాబు తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న విఆర్‌ఒ వెంకటేశ్వరరావు

జెండా సభ విజయవంతం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల శంఖారావం విజయకేతనం సభను అడ్డుకునేందుకు ఎన్ని కుయుక్తులు పన్నినా సభను విజయవంతం చేసిన టిడిపి, జనసేన నాయకులకు జనసేన నియోజవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసం వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో సామాన్య, మధ్య తరగతి, పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనసేన, టిడిపి ప్రభుత్వం కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు.

మొగల్తూరు : తాడేపల్లిగూడెంలోని పత్తిపాడులో నిర్వహించిన జెండా సభను విజయవంతం చేసిన తెలుగు తమ్ముళ్లకు నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ధన్యవాదాలు తెలిపారు. గురువారం సాయంత్రం మొగల్తూరులో పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. కార్యక్రమంలో బొల్ల చంటి, మామిడిశెట్టి సత్యనారాయణ, పాల రాంబాబు ఉన్నారు.

భీమవరం రూరల్ : తాడేపల్లిగూడెంలో నిర్వహించిన టిడిపి, జనసేన జెండా మహాసభ విజయవంతం కావడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు ప్రారంభమయ్యాయమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఐదు కోట్ల తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగు నింపడం కోసం భవిష్యత్తు కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జతకట్టారని తెలిపారు. రానున్న ఎన్నికలలో విజయ ఢంకా మోగిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నేడు కాళ్లలో నిరసన దీక్ష

ప్రజాశక్తి - కాళ్ల

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు తెలిపారు. గురువారం కాళ్లలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలతో కూడిన కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఐదేళ్లుగా సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అనేక సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను 1214 మెమో ద్వారా వైసిపి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేసి, మెమో 1214ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కాళ్లలో నిరసన దీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పట్టుబోతుల మధుసూదన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.